సాక్షి సంగారెడ్డి

శనివారం, 8, జూలై, 2023



మచ్చలేని నేత సోలిపేట

తన 70 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నత పదవులు చేపట్టిన మచ్చలేని గొప్ప నేత సోలిపేట రాంచంద్రారెడ్డి అని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 8లో



అరకొర బస్సులు..

9లో

ఆర్టీసీ బస్సుల సంఖ్య తగ్గింది. దీంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏడుగురికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

సదాశివపేట(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో రెండో రోజుకు చేరుకుంది. ఆ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జీఓ నంబర్ 51 ప్రకారం మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, పాత కేటగిరి విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.దశరథ్, కేవీపీఎస్ మండల కార్యదర్శి ఎస్.మహేశ్, మండల అధ్యక్షులు బుచ్చయ్య, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వేంకటేశ్వర్లు

కోహీర్(జహీరాబాద్): కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి వేంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని దిగ్వాల్ ప్రభుత్వోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. శ్రద్ధగా చదివి మంచి మార్కులతో పాసై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. పదో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మన ఊరు– మనబడి పనులను పరిశీలించారు. పనులల్లో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వారంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కమ్యూనికేషన్ మొబిలైజేషన్ అధికారి వేంకటేశం, ఎంఈఓ శంకర్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని మహిళా వికాస కేంద్రంలో మహిళలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. 50 శాతం ఉద్యోగాలు ఉన్నాయని అన్నింటిలో రిజర్వేషన్లు ఉన్నాయని తెలిపారు. చట్టాలపై మహిళలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, వరకట్న నిషేధ చట్టాలు, ఏ విధమైన న్యాయ సహాయం కావాలన్నా ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మహిళ వికాస కేంద్రం మేనేజర్ సుగుణ, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకుడు కొండల్, మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. రైతు స్వరాజ్య వేదిక, మంజీర రైతు సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతుల సమస్యలపై ప్రజావేదిక కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిధిలోని కోనాపూర్, ఆరూర్ గ్రామాల్లో నిర్వహించారు. కౌలు రైతుల సమస్యలపై చర్చించారు.

పాలీ పాయే!

- అమలుకు నోచని ఉద్యాన వన పథకాలు
- నిధుల్లేక 'పాలీహౌస్'కు మంగళం
- 'పందిరి సాగు'ది అదే దారి
- 'వెజిటబుల్ హబ్'గా ఉమ్మడి మెదక్ జిల్లా
- సహకారం లేక తగ్గుతున్న సాగు



'పాలీహౌస్'లో సాగవుతున్న కూరగాయలు

గజ్వేల్: ఉద్యానవన పథకాల అమలుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. నిధుల కొరత కారణంగా 'పాలీ హౌస్' పథకానికి మంగళం పాడగా... కేటాయింపుల్లేక 'పందిరి సాగు'కు సైతం ఇదేరకమైన పరిస్థితులు నెలకొన్నాయి. కూరగాయల ధరలు మండిపోతున్న వేళ...ఈ అంశం తెరపైకి వస్తున్నది. విస్తారమైన కూరగాయల సాగుతో 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించిన ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు సహకారం లేక సాగు తగ్గించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో (సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్) ప్రధాన పంటలు వరి, పత్తి, మొక్కజొన్నకు దీటుగా కురగాయలు సాగవుతున్నాయి. జిల్లాల పరిధిలో సుమారు 15లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతుండగా, గతంలో 2.5లక్షల ఎకరాలకుపైగా వివిధ రకాల కూరగాయల పంటలు పండించేవారు. ఈ విధంగా ఉమ్మడి మెదక్ జిల్లా 'వెజిటటుల్ హబ్'గా ఆవిర్భవించింది. ప్రత్యేకించి గజ్వేల్, పటాన్‌చెరు, సిద్దిపేట, నర్సాపూర్, మెదక్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో కూరగాయలు విస్తారంగా సాగులో ఉండేవి. కూరగాయల రైతులకు వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఏ యేటికాయేడు కుంగదీస్తున్నాయి. నష్టాల బారిన పడి అల్లాడుతున్నారు. ఇలాంటి సందర్భంలో రైతులు లాభాల పంట పండించడానికి ప్రభుత్వం పాలీహౌస్ పథకానికి ఏడేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. పథకం ద్వారా ఎకరాకు 75శాతం సబ్సిడీ కింద రూ.39లక్షలు ప్రభుత్వం అందజేసింది. రైతు తన వాటా కింద రూ.8.44లక్షలు చెల్లిస్తే చాలు... 'పాలీహౌస్'కు సంబంధించి అన్ని రకాల పరికరాలు పొలంలో బిగించేవారు. కానీ ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ పథకం ఆశించిన విధంగా అమలు కాలేదు. 2014 నుంచి మూడేళ్లపాటు కేవలం 200 ఎకరాలకు మాత్రమే పథకం వర్తింపజేశారు. తొలి ఏడాదిలో 250 ఎకరాలకు పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులను లక్ష్యం విధించింది. కానీ ఈ టార్గెట్ మూడేళ్లల్లో కూడా సాధించలేకపోయారు. పలువురు రైతులకు మంజూరు పత్రాలు వచ్చినా...నిధులు విడుదల కాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోయారు. ప్రస్తుతం నిధుల కొరత వల్ల ఈ పథకానికి ప్రభుత్వం దాదాపు మంగళం పాడింది. పాలీహౌస్‌లపై ఆశలు చాలించుకున్న రైతులు కనీసం 'పందిరి సాగు' ద్వారానైనా కూరగాయలు సాగు చేద్దామనుకుంటే...కొన్నేళ్లుగా ఈ పథకానికి ఉద్యానవన శాఖ నుంచి నిధులు రావటం లేదు. పందిరి పరికరాల కోసం ఎకరాకు రూ.లక్ష వరకు అందించి ఇందులో 50శాతం సబ్సిడీ ఇచ్చేవారు. ఈ పథకం కోసం చాలామంది రైతులు దరఖాస్తు చేసుకొని ఉద్యానవన శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారేలేరు. ఉపాధి హామీ పథకంలో నామమాత్రంగా ఈ పథకం అమలు చేస్తున్నా ముందుకు సాగటంలేదు. దీంతోపాటు కూరగాయల సాగుకు అవసరమయ్యే డ్రిప్ పరికరాలు కూడా సకాలంలో అందకపోవడంతో రైతులను కుంగదీస్తున్నది.

'వెజిటబుల్ హబ్'ను విస్మరిస్తే ఎలా?

ఉమ్మడి మెదక్ జిల్లా విస్తారమైన కురగాయల సాగుతో 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించింది. ఇక్కడ ఉత్పత్తవుతున్న కూరగాయలు హైదరాబాద్ నగరానికే కాకుండా ఢిల్లీ, కలకత్తా, చంద్లాపూర్, బెంగుళూర్ లాంటి ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. ఒక్క రోజు ఇక్కడి నుంచి కూరగాయలు వెళ్లపోతే దేశంలోని ప్రధాన కూరగాయల మార్కెట్లన్నీ అల్లాడే పరిస్థితి ఉండేది. ఇలాంటి సందర్భంలో కూరగాయల రైతులకు ఎంత చేయూతనిచ్చినా తక్కువే. కానీ...ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేక ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగు తగ్గే పరిస్థితి వస్తుంది. ఒకప్పుడు 3లక్షల ఎకరాల్లో సాగయ్యే కూరగాయలు ప్రస్తుతం లక్షన్నర ఎకరాల్లోపు పడిపోయింది. కనీసం సాగు అధికంగా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లా లాంటి ప్రాంతాల్లోనైనా వివిధ పథకాలకు సబ్సిడీలను ప్రత్యేకంగా అమలు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

సబ్సిడీ లేక సాగు తగ్గించా



నాకు ఎనిమిదెకరాల భూమి ఉంది. గతంలో 5 ఎకరాల్లో కూరగాయలు సాగుచేసే వాడిని. కానీ ఇప్పుడు ఉద్యాన పథకాలకు సబ్సిడీలు ఎత్తేసింద్రు. డ్రిప్ కూడా సక్రమంగా రావడం లేదు. అందువల్ల సాగు సగం తగ్గించి రెండున్నర ఎకరాల్లో మాత్రమే చేస్తున్న. మిగితా విస్తీర్ణంలో సాధారణ పంటలు వేస్తున్న.

– పాశం సుదర్శన్‌రెడ్డి, కూరగాయల రైతు, బంగ్లావెంకటాపూర్, గజ్వేల్ మండలం

సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కొండాపూర్(సంగారెడ్డి): పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. పదో తరగతి ఫలితాలలో 569 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 560 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఆరుగురు ఫెయిల్ అయ్యారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 10,095 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 5632 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషన్ విభాగంలో 552 మంది పరీక్షలు రాయగా 290 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 4,432 మంది పరీక్షలు రాయగా, 2011 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒకేషన్ విభాగంలో 296 మందిలో 165 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

ఎస్టీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలి



ట్రైకార్ చైర్మన్‌ను కలిసిన సంఘం నాయకులు

నారాయణఖేడ్: ఎస్టీ కార్పొరేషన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ విస్లావత్ రాంచందర్ నాయక్‌ను కోరారు. శుక్రవారం సంఘం జిల్లా, డివిజన్ నాయకులు రాజునాయక్, రవీందర్‌నాయక్, హన్యానాయక్, లక్ష్మణ్ చౌహాన్, చంద్రమోహన్‌తో కలిసి హైదరాబాద్‌లో కలిశారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి, స్వయం ఉపాధికి ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందించే రాయితీరుణాలు దోహదం చేస్తాయన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. చైర్మన్ సానుకూలంగా స్పందించారని రమేష్ చౌహాన్ తెలిపారు.

నిరసన దీక్షను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయుల ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద ఈనెల 17న జరిగే నిరసన దీక్షను జయప్రదం చేయాలని రాష్ట్ర కోశాదికారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ నాయకులు కంది, సంగారెడ్డి మండలాల్లో గల గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరు మేనేజ్‌మెంట్‌లలో ఉన్న గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్స్, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలన్నారు. అదేవిధంగా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు డిప్యూటీ వార్డెన్, కేర్ టేకర్ లను కేటాయించాలని, పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని తదితర డిమాండ్స్ తో రాష్ట్రవ్యాప్తంగా జూలై 17న నిరసన దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. అయినా సమస్యల పరిష్కారం కాకపోతే హైదరాబాద్‌లో మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, కంది మండల ప్రధాన కార్యదర్శి ఆర్.సింహాచలం, సంగారెడ్డి మండలం అధ్యక్షుడు యం.విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కనీస వేతనాలు సవరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున
- పటాన్‌చెరు పారిశ్రామికవాడ లోకి ప్రవేశించిన జీపు జాతా



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

పటాన్‌చెరు: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కార్మికుల కనీస వేతనాలను వెంటనే సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి చేపట్టిన రాష్ట్ర వ్యాప్త జీపు జాతా శుక్రవారం పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోకి ప్రవేశించింది. ఎంఎస్ఎన్ రుద్రారం, పాశమైలారంలోని కిర్బీ పరిశ్రమ వద్ద వారు మాట్లాడారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు గత 15 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించలేదన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 12 నుంచి జూలై 17 వరకు సీఐటీయూ కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు జిల్లాలో జూలై 4 నుంచి జీపు జాతా ప్రారంభమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. ప్రతీ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులు నూటికి 90 శాతం పైగా ఉన్నారన్నారు. ఇందులో ఎక్కువగా వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులే పనిచేస్తున్నారన్నారు. ఈనెల 17 వరకు జీపు జాత కొనసాగుతుందని ఈలోపు ప్రభుత్వం స్పందించి కనీస వేతనాలను సవరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, సురేశ్, నరేశ్, శాంతకుమార్, జయ కుమార్, చంద్ర కిరణ్ సింగ్, మల్లేష్, శ్యామ్, కార్మికులు పాల్గొన్నారు.

భూ క్రమబద్ధీకరణ దరఖాస్తులు పరిష్కరించాలి

- రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్

సంగారెడ్డి టౌన్: భూ క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులన్నింటిని త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ క్రమబద్ధీకరణ, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ధరణిలో నూతన ఆప్షన్స్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58, 59 జీఓల కింద వచ్చిన భూ క్రమబద్ధీకరణ దరఖాస్తులన్నింటిని త్వరగా పరిష్కరించాలన్నారు. జీఓ 59లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సంబంధిత రుసుము సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధరణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పరిష్కరించాలని సూచించారు.కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాలో జీఓ 58 కింద గతంలో వచ్చిన దరఖాస్తులన్నింటిని పరిష్కరించామని, అర్హులైన వారికి క్రమబద్ధీకరణ చేసి పట్టా సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందన్నారు. జీఓ 59లో 471 దరఖాస్తులు రాగా, అందులో 313 మంది రుసులు చెల్లించి క్రమబద్ధీకరణ చేయించుకున్నట్లు చెప్పారు. 158 మంది పూర్తి రుసుము చెల్లించలేదన్నారు. 2023లో జీఓ 58లో కొత్తగా 3,391 దరఖాస్తులు వచ్చాయని, అలాగే జీఓ 59లో 2597 దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని వివరించారు. ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్ఓ నగేశ్, సెక్షన్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణులైన గుర్తింపులేని పాఠశాల టెన్త్ విద్యార్థులు

- మంత్రి చొరవతో పరీక్షలు రాసిన ఆక్స్‌ఫర్డ్ స్టూడెంట్స్
- వివరాలు వెల్లడించిన ఎంఈఓ

జహీరాబాద్ టౌన్: పాఠశాలకు గుర్తింపులేని కారణంగా టెన్త్ ఎగ్జామ్స్ రాయని విద్యార్థులు అధికారుల చొరవతో అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాధికారి బస్వరాజ్ తెలిపారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల యాజమాన్యం గుర్తింపు ఉన్న రెన్యూవల్ చేసుకోకుండా తరగతులు నిర్వహించింది. పదో తరగతిలో 8 మంది విద్యార్థులు ఉండగా వారి నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసి బోర్డుకు చెల్లించని కారణంగా వారు టెన్త్ పరీక్షలు రాయలేయలేకపోయారు. ఈ విషయాన్ని ఎంఈఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేనా, జిల్లా విద్యాధికారి వేంకటేశ్వర్ స్పందించి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించారు. పరీక్షలు రాసిన ఎనిమిది మంది ఉత్తీర్ణులయ్యారు. తమ భవిష్యత్ దెబ్బతినకుండా పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పొలిటికల్ హీట్

జహీరాబాద్: నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అన్ని ప్రధాన రాజకీయపార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. చేరికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీతో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి.

- అటు చేరికలు.. ఇటు పదవుల పందేరం
- జహీరాబాద్ జైకొట్టేది ఎవరికో..!

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వై.నరోత్తం గురువారం ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఆయన టీఆర్ఎస్‌లో చేరడం రాజకీయచర్చకు దారి తీసింది. ఇటు కాంగ్రెస్‌కు ఝలక్ ఇచ్చినట్టు కాగా, టీఆర్ఎస్‌లో టికెట్ ఆశావాహులకు సైతం అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆశిస్తూ వచ్చిన నరోత్తం అనూహ్యంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడానికి గల కారణాలను ప్రజలు, రాజకీయ నేతలు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్‌లో టికెట్ వచ్చే అవకాశాలు లేనందునే పార్టీ మారి ఉండవచ్చనే అభిప్రాయాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ టికెట్‌ను వికారాబాద్‌కు చెందిన మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ గట్టిగా ఆశిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఇదే కారణంతో నరోత్తం పార్టీ మారాడా అనే దానిపై చర్చించుకుంటున్నారు. నరోత్తం రెండు పర్యాయాలు టీడీపీ తరపున ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఎమ్మెల్యే టికెట్ ఆశతోనే బీఆర్ఎస్‌లో చేరి ఉండవచ్చనే ఊహాగానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్‌రావు రెండో పర్యాయం టికెట్‌ను గట్టిగా ఆశిస్తున్నారు. గురువారం ఆయన పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. టికెట్‌ను దక్కించుకునేందుకు కలిసి ఉంటారనే ప్రచారం సాగుతోంది.



వై.నరోత్తం

మాజీ మంత్రి ఎండీ ఫరీదుద్దీన్ తనయుడు తన్వీర్‌కు రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించారు. ఇప్పటికే అతడికి మైనార్టీ కమిషన్ సభ్యుడి పదవి ఉంది. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే నియామకం జరిగిందనే ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో మైనార్టీ ఓట్లు అధికంగా ఉండటం వల్లే తగిన ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మైనార్టీల ఓట్లు కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లకుండా ఉండేందుకుగాను పార్టీ ఈ మేరకు నిర్ణయం తీసుకుందని పలువురు విశ్లేషిస్తున్నారు.



ఎండి తన్వీర్

సామాజిక కార్యకర్త, రైతు సంఘం నాయకుడు ఢిల్లీ వసంత్ ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అధిష్టానం ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 10వ తేదీన మంత్రి హరీశ్ రావు సమక్షంలో పార్టీలో చేరనున్నారు. వసంత్ సైతం జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్‌ను గట్టిగా ఆశిస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ టికెట్‌ను ఆశించినా లభించలేదు. ఈమారు ఎలాగైనా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగాలనే లక్ష్యంగా కిందిస్థాయి నుంచి గ్రౌండ్ వర్క్ చేసుకుంటూ వస్తున్నారు. సామాజిక, చెరకు రైతుల సంక్షేమం కోసం ఉద్యమాలు చేసినట్లు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తూ వచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్రమత్తమై పావులు కదుపుతున్నట్లు, అందులో భాగమే చేరికలు, పదవుల కేటాయింపులు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. నరోత్తంను పార్టీలో చేర్చుకోవడం, తన్వీర్‌కు నామినేటెడ్ పదవిని కేటాయించడం, ఢిల్లీ వసంత్‌ను పార్టీలో చేర్చుకోవాలని నిర్ణయించడం వ్యూహాత్మకంలోనే భాగమనే అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.



ఢిల్లీ వసంత్



రాంచందర్ రాజనర్సింహ

బీజేపీ సైతం తాము కూడా పోటీలో ఉన్నామని నిరూపించేందుకు గాను పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేసింది. రాంచందర్ రాజనర్సింహను పార్టీలో చేర్చుకుని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించింది. కేంద్ర పశుసంవర్థక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల రెండు నెలల క్రితం జహీరాబాద్ వచ్చి రాంచందర్ రాజనర్సింహను పార్టీలో చేర్చుకున్నారు. ఆయనతో పలు పార్టీ కార్యకలాపాలను నిర్వహించారు. అంతకు ముందు చింతల్‌గట్టు సుధీర్‌కుమార్ టీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. అతడికి జిల్లా అధికార ప్రతినిధి పదవిని కేటాయించారు. ఇటీవల కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల వచ్చి జహీరాబాద్‌లో మేధావులతో సమావేశం నిర్వహించి బీజేపీకి ప్రజలు ఎందుకు మద్దతు ఇవ్వాలి అనే విషయాన్ని విశ్లేషించి చెప్పారు. ఐదు రోజుల క్రితం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జహీరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు వచ్చి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలకు సిద్ధం చేశారు. ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో బీజేపీదే పైచేయిగా ఉందని, జహీరాబాద్ స్థానాన్ని సైతం గెల్చుకుంటామనే ధీమాను పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాపకింద నీరులా పార్టీ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. దీంతో జహీరాబాద్ రాజకీయాలు రసకందాయంలో పడినట్లయింది.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి టౌన్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పోతిరెడ్డి పల్లి చౌరస్తా సమీపంలో రోడ్డు పక్కన ఓ మృత దేహం ఉన్నదనే సమాచారం మేరకు 100కు వచ్చిన ఫోన్‌ కాల్‌ ద్వారా సంగారెడ్డి ప్రభుత్వా సుపత్రిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఆ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడని, భిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కడుపునొప్పి భరించలేక ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తెల్లాపూర్‌ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో నివాసం ఉండే బ్రహ్మయ్య (40) ప్రైవేట్‌ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత 10ఏళ్లుగా బ్రహ్మయ్య కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం అతని భార్య సరస్వతి ఇంటి నుంచి బిహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌లోని దేవాలయానికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో అతను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీ కొని మహిళ..

పటాన్‌చెరు టౌన్‌: రోడ్డు దాటుతున్న ఓ మహిళను లారీ ఢీకొట్టిన సంఘటనలో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ ప్రసాద్‌ రావు కథనం ప్రకారం..హైదరాబాద్‌ని బోయిన్‌పల్లికి చెందిన గౌసియబేగం(45) శుక్రవారం పటాన్‌చెరు జె.పి కాలనీలో ఉండే సోదరుడు వద్దకు బస్సులో పటాన్‌చెరుకు చేరుకుంది. ఈ క్రమంలో రోడ్డు దాటుతున్న గౌసియబేగంను హైదరాబాద్‌ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోదరుడు అబ్దుల్‌ ఖాదర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం, గురువారం నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 11 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, ఇద్దరికీ రూ.3వేలు, ఒకరికి రూ.5 వేలు, మరో వ్యక్తికి రూ.4,500 జరిమానాతో పాటు ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్‌: తప్పిపోయిన బాలుణ్ని స్థానికుల సమాచారంతో పోలీసులు తీసుకొచ్చి తల్లి దండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్‌ మండలం హంగిర్గా(బి) గ్రామానికి చెందిన బురుకల శ్రీకాంత్‌, శిల్పల నాలుగేళ్ల కుమారుడు పట్టణంలో తప్పిపోయాడు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో చిన్నారి ఏడుస్తూ తిరుగుతున్నాడనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాలుడిని తీసుకొచ్చారు. ఆ చిన్నారి వివరాలు చెప్పక పోవడంతో సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తల్లిదండ్రులకు ఆ చిన్నారిని అప్పగించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

మెదక్‌జోన్‌: గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..కూచన్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డె సత్యనారాయణ(46) గుండెనొప్పి వస్తుందని కుటుంబీకులకు చెప్పడంతో అతనిని మెదక్‌ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అంత్యక్రియల కోసం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.10వేలు, మైనంపల్లి సోషల్‌ సర్వీస్‌ చైర్మన్‌ రోహిత్‌ రూ.10వేలు, కాంగ్రెస్‌ ఎస్సీసెల్‌ ఉపాధ్యక్షుడు లింగాల సంతోశ్‌ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్‌ దేవాగౌడ్‌, కొంపల్లి సుభాశ్‌ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిష్టాగౌడ్‌, బయ్యన్న తదితరులు సంతాపం ప్రకటించారు.

మచ్చలేని నేత సోలిపేట రాంచంద్రారెడ్డి

సంస్మరణ సభలో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


రాంచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చైనా మిత్రమండలి నాయకులు

దుబ్బాకటౌన్‌ : తన 70 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నత పదవులు చేపట్టిన మచ్చలేని గొప్ప నేత సోలిపేట రాంచంద్రారెడ్డి అని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌ బంజారాహిల్స్‌లోని రావినారాయణరెడ్డి మెమోరియల్‌ హాల్‌లో దివంగత మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తొలితరం రాజకీయ నేతగా నేటి రాజకీయాలకు రాంచంద్రారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. సోషలిజం భావాలతో రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టిన ఆయన తన స్వగ్రామం చిట్టాపూర్‌ తొలిసర్పంచ్‌గా ప్రస్థానం మొదలుపెట్టి ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా, భారత్‌, చైనా మిత్ర మండలి అధ్యక్షుడిగా, స్థానిక సంస్థల సంస్కరణకు ఆద్యుడిగా ఎన్నో గొప్ప పదవులు చేపట్టి దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారని కొనియాడారు. సీఎం కేసీఆర్‌కు సైతం రాజకీయ గురువుగా నిలువడం చాల గొప్ప విషయమన్నారు.

సోలిపేట రాంచంద్రారెడ్డి స్మృతిలో పుస్తకం ఆవిష్కరణ

ఇండియా– చైనా మిత్రమండలి వారు కొన్ని సభల్లో రాంచంద్రారెడ్డి ప్రసంగాలతో ప్రచురించిన ప్రజా పక్ష నేత సోలిపేట రాంచంద్రారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దివంగత నేత రాంచంద్రారెడ్డి కుమారుడు, రాష్ట్ర గ్రామీణ బ్యాంకుల అసోసియేషన్‌ అధ్యక్షులు సోలిపేట వెంకటేశ్వర్‌ రెడ్డి, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, లోక్‌సత్తా అధినేత డాక్టర్‌ జయప్రకాశ్‌నారాయణ, సీపీఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్‌ రెడ్డి, చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్‌, మాజీ మంత్రి రాజేశం, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత, పాశం యాదగిరి, డాక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి, జతిన్‌కుమార్‌, మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్‌రెడ్డి, ఎర్రోల్ల శ్రీనివాస్‌, బక్కి వెంకటయ్య తదితరులు ఉన్నారు.


క్యాసారం రోడ్డు వైపు తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గజ్వేల్‌లో కొనసాగిన పోలీసుల తనిఖీలు

గజ్వేల్‌: గజ్వేల్‌ పట్టణంలో పోలీసుల తనిఖీలు, పికెటింగ్‌లు శుక్రవారం కూడా కొనసాగాయి. పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారులైన ప్రజ్ఞాపూర్‌ చౌరస్తా, తూప్రాన్‌ వై జంక్షన్‌తోపాటు ముట్రాజ్‌పల్లి, సంగాపూర్‌, దౌల్తాబాద్‌, క్యాసారం రోడ్లల్లో వాహనాలను విస్తతంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన వారి వివరాలను సేకరించిన తర్వాతే పట్టణంలోకి అనుమతించారు. అదేవిధంగా పట్టణంలో అంబేడ్కర్‌ చౌరస్తా, వివేకానంద చౌరస్తా, ఇందిరాపార్కు చౌరస్తా, మార్కెట్‌ రోడ్డు, పిడిచెడ్‌ రోడ్డు, ఐఓసీ చౌరస్తా తదితర ముఖ్యమైన ప్రదేశాల్లో పికెటింగ్‌ కొనసాగింది.

సైబర్‌ వలలో ఇద్దరు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్‌: సైబర్‌ వలలో ఇద్దరు మహిళ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు పడి డబ్బులు పోగొట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్‌ పరిధిలోని బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన ఓ మహిళ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తుంది. జూన్‌ 28వ తేదీన ఆమె వాట్సాప్‌కి బిట్‌ కాయిన్‌కు సంబంధించిన లింక్‌ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలను నమోదు చేసింది. బిట్‌ కాయిన్‌లో నగదు ఇన్వెస్ట్‌ చేస్తే రెట్టింపు నగదు వస్తుందనే ఆశతో ఐదు దఫాలుగా రూ.1,98,000లు సైబర్‌ నేరగాళ్లు చెప్పినట్టుగా వేసింది. ఇంకా నగదు వెయ్యాలని కోరడంతో అనుమానంతో ఆమె తను ఇన్వెస్ట్‌ చేసిన నగదు చెల్లించాలని వారిని కోరింది. దీంతో సైబర్‌నేరస్తులు స్పందించలేదు. ఈ క్రమంలో తను మోసపోయినట్లుగా గుర్తించి సైబర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం శుక్రవారం అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మరోసంఘటనలో..

అమీన్‌పూర్‌ త్రిశూల్‌ డిఫెన్స్‌ కాలనీకి చెందిన ఓ మహిళా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగినికి జూలై 2వ తేదీన అమెజాన్‌ పే బ్యాలెన్స్‌ అనే లింక్‌ వచ్చింది. నగదు ఇన్వెస్ట్‌ చేస్తే కమిషన్‌ ఇస్తామని చెప్పడంతో బాధితురాలు పలుదఫాలుగా రూ.2,35,000లు ఇన్వెస్ట్‌ చేసింది. తను పెట్టిన నగదుతో పాటు కమిషన్‌ ఇవ్వాలని అడగడంతో సైబర్‌నేరస్తులు స్పందించలేదు. విషయం తెలుసుకున్న ఆమె మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం శుక్రవారం అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలి పదవికి రాజీనామా


లక్ష్మీబాయి రవీందర్‌నాయక్‌

నారాయణఖేడ్‌: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలి పదవికి రాజీనామా చేస్తున్నట్లు నారాయణఖేడ్‌ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌ నాయక్‌ తెలిపారు. శుక్రవారం సిర్గాపూర్‌లోని గిరిజన బాలికల గురుకులంలో గిరిజన బాలికల ప్రవేశాల కోసం వెళితే గురుకులంలోకి అనుమతించలేదన్నారు. జెడ్పీటీసీ, స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలైనా హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల అనుమతి పత్రం తెస్తేనే లోనికి అనుమతిస్తామని గురుకుల ప్రత్యేక అధికారిణి అటెండర్‌ ద్వారా సెల్‌ఫోన్‌లో మాట్లాడించారని తెలిపారు. విషయాన్ని ఫోన్‌ ద్వారా తాను ఆర్సీఓ కల్యాణికి వివరించినా ఆమె కూడా అదే విషయాన్ని తెలిపారన్నారు. స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలినైనా తనజాతికి న్యాయం చేసే పరిస్థితి లేకపోవంతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. రాజీనామా లేఖను కలెక్టర్‌, జెడ్పీచైర్‌పర్సన్‌, సీఈఓకు పంపినట్లు వివరించారు.

ఎడ్లు మృతి

సదాశివపేట రూరల్‌ (సంగారెడ్డి): వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన రైతు మెట్టు రాకేశ్‌ రెండు ఎడ్లు శుక్రవారం మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి..ఎడ్లపై ఎవరో గిట్టని వారు విష ప్రయోగం చేశారని అనుమానం వ్యక్తం చేశారు. సుమారు రూ.2లక్షల విలువ చేసే ఎడ్లు మృతి చెందడంతో రైతు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

సిర్గాపూర్‌లో పిచ్చి కుక్కల వీరంగం

కల్హేర్‌(నారాయణఖేడ్‌): సిర్గాపూర్‌ మండల కేంద్రంలో పిచ్చి కుక్కలు వీరంగం చేశాయి. వీధి కుక్కలు దాడి చేయడంతో 10 మంది వరకు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బండగార్‌ మన్నప్ప, సంజీవ్‌, చిన్నారి నిహారిక, తదితరులను కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. ఎంపీటీసీ పీరప్ప దగ్గరుండి వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌ ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. మిగత వారు సిర్గాపూర్‌ పీహెచ్‌సీ, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.


గాయపడ్డ బండగార్‌ మన్నప్ప


గాయపడ్డ చిన్నారి నిహారిక

బకాయి వేతనాలు చెల్లించాలి


డీఆర్వో నగేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కొండాపూర్‌(సంగారెడ్డి): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌ఓ నగేశ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు 25 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.వేయి నుంచి రూ.3 వేలకు పెంచిందని, కానీ ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

కంది(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కందిలో చోటుచేసుకుంది. రూరల్‌ ఎస్‌ఐ శ్రీనివాస్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కందిలోని పాతకింగ్స్‌ దాబా సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి పూర్తి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాసు పత్రిలో మార్చురిలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా సంబంధికులు ఆచూకీ తెలిస్తే 8712656746, సీఐ 8712656719 ఫోన్‌ నంబర్లపై సంప్రదించొచ్చన్నారు.

కోడ్‌కు ముందే లక్ష సాయం అందించాలి

అదనపు కలెక్టర్‌కు విశ్వబ్రాహ్మణుల వినతి


అదనపు కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న విశ్వబ్రాహ్మణులు

సిద్దిపేటరూరల్‌: ప్రభుత్వం బీసీల కోసం ప్రవేశపెట్టిన రూ.లక్ష సాయాన్ని ఎన్నికల కోడ్‌కు ముందే అందించాలని అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డికి విశ్వబ్రాహ్మణుల సంఘం వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం రూ. లక్ష సాయం అందించేందుకు చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్న క్రమంలో త్వరగా ఎన్నికల కోడ్‌కు ముందే రూ. లక్ష సాయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మన సంఘం నాయకులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తకు పదేళ్ల జైలు

రేగోడ్‌(మెదక్‌): శారీరకంగా మానసికంగా వేధించడమేగాకుండా బ్లేడుతో భార్య గొంతు కోసిన భర్తకు మెదక్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తి జితేందర్‌ పదేళ్ల జైలు, రూ.2వేలు జరిమానా విధించారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని మద్దూరి సరితకు 2006లో గజ్వాడ గ్రామానికి చెందిన మల్లారెడ్డితో వివాహం జరిపించి ఇల్లరికం తెచ్చుకున్నారు. భర్త ఇల్లరికం వచ్చిన తర్వాత ఒక సంవత్సరం పాటు బాగానే ఉన్నాడు. ఆ తర్వాత తాగుడుకు బానిసై చీటికిమాటికి భార్యను కొట్టేవాడన్నారు. తల్లిదండ్రులు, అత్తగారిని వారి కుటుంబ సభ్యులను పిలిపించి గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టించి మందలించారు. ఆ తర్వాత కూడా మళ్లీ ఎప్పటిలాగే ప్రవర్తించేవాడన్నారు. 2022, సెప్టెంబర్‌ 6న సాయంత్రం ఎప్పటిలాగానే సరిత పత్తి చేనుకు వెళ్లి తిరిగి వస్తుండగా భర్త మద్యంమత్తులో ఆమె గొంతు కోశాడని చెప్పారు. దీంతో స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం నారాయణఖేడ్‌ ఆసుపత్రికి తరలించారు. తన భర్త మద్దూరి మల్లారెడ్డి తనను చంపాలనే ఉద్దేశంతో గొంతు కోసి పారిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తి జితేందర్‌ నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధించారన్నారు.

సంగారెడ్డి టౌన్‌లో..

సంగారెడ్డి టౌన్‌: భార్యను గొంతు కోసి చంపడానికి ప్రయత్నించిన వ్యక్తికి ఐదేళ్ల జైల్లు శిక్ష విధించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మల్కాపూర్‌ పరిధిలో తొడలు గూడెంలో నివాసం ఉంటున్న అశ్విన్‌ కుమార్‌ భార్య శకుంతలను 2018లో ఇంట్లో ఉండగా బ్లేడ్‌తో గొంతు కోయడానికి ప్రయత్నించాడు. ఆమె గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమా చారం అందజేశారు. ఈ క్రమంలో కోర్టులో జడ్జి విచారణ అనంతరం 5 సంవత్సరాల శిక్షతోపాటు రూ.6వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

కలకలం రేపిన పిల్లల విక్రయం

మిరుదొడ్డి(దుబ్బాక): ఇద్దరు పిల్లలను పోషించలేని తండ్రి విక్రయానికి పెట్టాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన పానేటి పోచయ్య రేణుక దంపతులు. వీరికి మూడు సంవత్సరాల లోపు ఇద్దరు కుమారులు గౌతం, తరుణ ఉన్నారు. కొద్ది కాలంగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఇటీవల పోచయ్య భార్య రేణుక ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పోచయ్య అన్ని చోట్ల వెతికినా ఆమె ఆచూకి లభించలేదు. ఈ క్రమంలో పోచయ్య అనారోగ్యంతో బాధ పడుతూ పిల్లలను పోషించుకునే స్తోమత దిగజారింది. ఉండటానికి ఇల్లు సైతం లేక పోవడంతో ఇద్దరు పిల్లలను గుర్తు తెలియని వారికి విక్రయించాడు. దీంతో నమ్మదిగిన సమాచారంతో బాలల సంక్షేమ సమితి (చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ) ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్‌ అధికారి రాజు, శిశు గృహ సామాజిక కార్యకర్త రాజారాం, డీసీపీయూ సామాజిక కార్యకర్త అనితారాణి, కౌన్సిలర్‌ నర్సింహులు బాలరక్షక వాహనంలో మల్లుపల్లికి వెళ్లారు. సర్పంచ్‌ సిద్ధి భారతీ భూపతితో పాటు గ్రామస్తులను విచారించారు. ఈ విచారణలో అనారోగ్యంతో బాధ పడుతున్న పోచయ్య పిల్లలను పోషించే స్తోమత లేక ఎనగుర్తికి చెందిన గుర్తు తెలియని వాస్తవ్యులకు ఇద్దరు పిల్లలను కొద్ది రోజుల క్రితం విక్రయించాడు. ఈ క్రమంలో అతనికి విక్రయ సమయంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 11 వేలు అందజేశారు. కాగా పిల్లలకు ఇప్పటి వరకు ఆధార్‌ కార్డులు తీయించక పోవడంతో కొనుగోలు చేసిన వారికి భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయనే భయంతో వారు గత వారమే తిరిగి తండ్రి పోచయ్యకు పిల్లలను అప్పగించారు. అనారోగ్యంతో ఒక వైపు, ఉండటానికి ఇల్లు లేక మరోవైపు పిల్లలను పోషించలేక తండ్రి విక్రయానికి పెట్టినట్లు విచారణలో తేలిందని అధికారులు వెల్లడించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్‌ అధికారి రాజు మాట్లాడుతూ పిల్లలను పోషించలేని పరిస్థితుల్లో ఉన్న వారు జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి అప్పగించాలని కోరారు.


పిల్లలను విక్రయానికి పెట్టిన తండ్రి పోచయ్యను విచారిస్తున్న అధికారులు

ఇద్దరి అదృశ్యం

వేర్వేరు కారణాలతో ఇద్దరు అదృశ్యమయ్యారు.


మమత

చేగుంట(తూప్రాన్‌): ఇంట్లో చెప్పకుండా వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం..రాంపూర్‌ గ్రామానికి చెందిన యాపర్ల కుమారస్వామికి మిరుదొడ్డి మండలం వీరారెడ్డిపల్లికి చెందిన మమతతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. మమత ఈ నెల 5న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటినుంచి బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. దీంతో ఆందోళనకు గురైన కుమారస్వామి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అమీన్‌పూర్‌లో భార్య..

పటాన్‌చెరు టౌన్‌: భార్య అదృశంపై ఓ భర్త ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్‌ మండల పరిధిలోని పటేల్‌గూడ సృజన లక్ష్మీనగర్‌కు చెందిన శ్వేతారాణి(23) గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సురేష్‌ కుమార్‌ తన భార్య శ్వేతారాణి కోసం స్థానికంగా, తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆయన భార్య అదృశ్యంపై శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న నలుగురి మృతి

వేర్వేరు ఘటనల్లో జరిగిన ప్రమాదంలో నలుగురు చికిత్స పొందుతూ మృతి చెందారు.


బాల్‌రాజు (ఫైల్‌)

తొగుట(దుబ్బాక): హైదరాబాద్‌లోని ఫిర్జాదీగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన కామొల్ల రాజవ్వ, పోచవ్వ దంపతుల కుమారుడు బాల్‌రాజు(32) ఉపాధి కోసం నగరానికి వలసవెళ్లాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పిల్లలకు పాఠ్యపుస్తకాలు తీసుకొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితిని గమనించిన స్థానికులు చికిత్స కోసం ఆయణ్ని సమీపంలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మెదక్‌ మున్సిపాలిటీలో..


చిల్వేర ప్రవీణ్‌ మృతదేహం

మెదక్‌ మున్సిపాలిటీ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్‌ పట్టణంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని అజంపురా వీధికి చెందిన చిల్వేర ప్రవీణ్‌(35) డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన మెదక్‌ పట్టణంలోని ఓ కల్లు దుకాణం వద్ద పడిపోయాడు. దీన్ని గమనించిన అతని సోదరుడు గులాబ్‌ సింగ్‌ 108లో మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్‌): ప్రమాదవ శాత్తు మంటల్లో కాలి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎల్తూరి పోశయ్య(78) మృతి చెందాడు. త్రీ టౌన్‌ సీఐ భానుప్రకాశ్‌ తెలిపిన వివరాల ప్రకారం..సిర్సనగండ్ల గ్రామానికి చెందిన ఎల్తూరి పోశయ్య ఈ నెల 4వ తేదీన వ్యవసాయ బావి వద్ద పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని, గడ్డిని కాల్చే క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో పడి వెనక భాగం కాలింది. దీంతో అతణ్ని వెంటనే 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచనల మేరకు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుని తమ్ముని కుమారుడు బుచ్చిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


ఎల్లయ్య (ఫైల్‌)

దుబ్బాకరూరల్‌: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన భూంపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చిట్టాపూర్‌లో జరిగింది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3వ తేదీన గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ఎల్లయ్య(62) తన ఇంటి వద్ద రోడ్డు ప్రక్కన నిల్చొని ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన జిగిరి స్వామి(34)తన ట్రాక్టర్‌తో ఎల్లయ్యపైకి ఎక్కించాడు. ఎల్లయ్యకు తీవ్రగాయాలు కావడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని కోడలు కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


పంజ మంగ(ఫైల్‌)

గజ్వేల్‌రూరల్‌: అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన గజ్వేల్‌ మండలం అక్కారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అక్కారం గ్రామానికి చెందిన పంజ యాదగిరి–మంగ(46) దంపతులకు ప్రసాద్‌, హన్మంతు ఉన్నారు. వీరు తమకున్న అర ఎకరంతో పాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గురువారం పొలంలో విత్తనాలు నాటేందుకు మంగ వెళ్లింది. భర్త యాదగిరి మరోచోట కూలీ పనులకి వెళ్లాడు. రాత్రయినప్పటికీ మంగ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్ద వెతికారు. అక్కడ పొదల మధ్యన ఓ చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. కాగా గత కొంతకాలంగా తమ సమీప బంధువులతో భూతగాదాలు ఉన్నాయని, ఈ కక్షతోనే వాళ్లే హత్యచేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించి, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టివేత

- బంగారం విలువ రూ.1.60 కోట్లు
- రూ.8లక్షల జీఎస్టీ వసూలు చేసిఅప్పగింత

జహీరాబాద్‌: ముంబాయి నుంచి హైదరాబాద్‌కు ఓ వ్యాపారి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శుక్రవారం ఎక్సైజ్‌, అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..జహీరాబాద్‌ మండలంంలోని చిరాగ్‌పల్లి వద్ద 65వ జాతీయ రహదారిపై గల రాష్ట్ర సరిహద్దు ఎక్సైజ్‌ చెక్‌పోస్టు వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏఈఎస్‌ శ్రీనివాస్‌ రావు సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముంబాయి నుంచి హైదరాబాద్‌ వెళుతున్న కారును తనిఖీ చేశారు. కారులో సరైన పత్రాలు, బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న బంగారం పట్టుబడింది. పట్టుబడిన బంగారం విలువ రూ.1.60కోట్లుగా నిర్ధారించారు. జీఎస్టీ చెల్లించకుండా తరలిస్తున్నందునా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు సంగారెడ్డిలోని కమర్షియల్‌ ట్యాక్స్‌ అధికారులకు కేసును అప్పగించారు. దీంతో వారు 200 శాతం జీఎస్టీ కింద రూ.8లక్షలు ఫైన్‌ విధించారు. సదరు వ్యాపారి ఈ మేరకు ఫైన్‌ చెల్లించడంతో పట్టుబడిన బంగారాన్ని అతడికి అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు.


ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు పట్టుకున్న కారు

క్లుప్తంగా

భారీ వాహనాలను నియంత్రించండి


సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): భారీ వాహనాలతో బొల్లారం మున్సిపల్ రోడ్లు ధ్వంసమవుతున్నాయని నాయకులు శుక్రవారం సీఐ నయీమోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిపై భారీ వాహనాలు తిరగడంతో గుంతలుగా మారాయన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వరప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, సీఐటీయూ నాయకుడు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా అభివృద్ధి


ఉర్సు ఉత్సవాల్లో నీలం మధు, తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): కులమతాలకతీతంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ నేత, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలో గరీబ్‌షావలి దర్గా వద్ద శుక్రవారం నిర్వహించిన ఉర్సు ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మైనార్టీల సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, ఉర్సు ఉత్సవాల నిర్వహకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హరితహారం


జంబ్గిలో మొక్కలు నాటుతున్న కూలీలు

రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నారు. ఆయా గ్రామాల్లో నాటుతున్న మొక్కలను, కూలీల హాజరును ఈజీఎస్ అధికారులు పరిశీలిస్తున్నారు. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో గ్రామ పంచాయతీలో 8 నుంచి 8 వేల వరకు మొక్కలను నాటనున్నట్టు అధికారులు తెలిపారు. మండలంలో 2.25 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు 1.42 లక్షల మొక్కలు నాటడం పూర్తయిందని చెప్పారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


నూతనంగా ఎన్నికైన సభ్యులతో నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శిగా వెంకటేశ్, ఓబీసీ మోర్చా పట్టణ ఉపాధ్యక్షుడుగా జీవన్ సింగ్‌ను ఎన్నుకొని నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, పట్టణ ఇన్‌చార్జి దేవేందర్‌గౌడ్, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు రాంబాబు గౌడ్, శ్రీనివాస్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుజాత, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు రజిని, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


భిక్షపతిని సన్మానిస్తున్న ఖేడ్ జంగమ సమాజం నాయకులు

నారాయణఖేడ్: ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన మఠం భిక్షపతిని స్వామిని నారాయణఖేడ్ జంగమ సమాజం అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్ స్వామి, రేవన్న స్వామిల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీశైలం స్వామి, నరేష్ స్వామి పాల్గొన్నారు.

అరకొర బస్సులు.. తప్పని అవస్థలు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు


బొల్లారంలో బస్సుల కోసం విద్యార్థుల ధర్నా

జిన్నారం(పటాన్‌చెరు): ఆర్టీసీ బస్సుల సంఖ్య తగ్గింది. దీంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా సమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో 60 వేల వరకు జనాభా ఉంటుంది. మున్సిపల్ పరిధిలో 22 వార్డులు ఉన్నాయి. బొల్లారంలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించేందుకు పాఠశాల, కళాశాలలకు బస్సుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్తారు. అలాగే వేల సంఖ్యలో ప్రజలు వివిధ పరిశ్రమల్లో విధులు నిర్వర్తించేందుకు వెళ్తుంటారు. కాగా ఉదయం పరిశ్రమలు, కళాశాలలకు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉదయం ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. రెండు గంటల పాటు ధర్నా చేశారు. తమకు సరిపడా బస్సులు కేటాయించే విషయంలో అధికారుల నుంచి స్పష్టత వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని తెగేసి చెప్పారు. స్థానిక నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి విద్యార్థులకు అండగా నిలిచారు. సరిపడా బస్సులు లేక విద్యార్థులు, కార్మికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండగా వారు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సరిపడా బస్సులు నడిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం


ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. దీంతో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తుంది. కళాశాలలకు సమయానికి వెళ్లలేకపోతున్నాం.

– సాయివర్మ, ఇంటర్ విద్యార్థి

మా గోడు ఎవరికి చెప్పాలి


ఎప్పుడు ఆందోళన చేసిన పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప సమస్య మాత్రం అలాగే ఉంటుంది. ఉదయం వేళలో బస్సులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. మా గోడు ఎవరికి చెప్పాలో తెలియడం లేదు.

– ఉష, విద్యార్థిని

చర్యలు తీసుకుంటాం

ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు పెంచేలా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ చైర్‌పర్సన్ సహకారంతో ఆయా డిపో మేనేజర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తాం. విద్యార్థులు ఆందోళన చెందొద్దు.

– రాజేంద్రకుమార్, కమిషనర్, బొల్లారం

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

- ఏడీఏ భిక్షపతి


మాట్లాడుతున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: చిరుధాన్యాలు పండించే రైతులకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏ భిక్షపతి అన్నారు. పస్తాపూర్ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు పట్టణంలోని దత్తగిరి కాలనీలో చిరుధాన్యాల (సంఘం) దుకాణాన్ని ఏర్పాటు చేయగా శుక్రవారం ఏడీఏ ప్రారంభించి మాట్లాడారు. డీడీఎస్ సంస్థ చిరుధాన్యాలను కాపాడడం గర్వించదగిన విషయమన్నారు. ఈ మధ్యకాలంలో చిరు ధాన్యాలకు డిమాండ్ బాగా పెరిగిందన్నారు. రైతులు పంటసాగుకు ముందుకు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో డీడీఎస్ వి త్తన సంరక్షకురాలు లక్ష్మమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఇసుక బావి పోచమ్మ తల్లి దేవాలయ పంచమ వార్షికోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్ కవిత శ్రీనివాస్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు ఐక్యంగా పనిచేయాలి

- మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్


మాట్లాడుతున్న సురేశ్ షెట్కార్, పక్కన నాయకులు

నారాయణఖేడ్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ సూచించారు. ఆయా మండలాలకు నూతన అధ్యక్షులుగా నియమితులైన వారితో పాటు ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు సాయిలు, ఎస్టీసెల్ అధ్యక్షుడు నెహ్రూనాయక్, మైనార్టీసెల్ అధ్యక్షుడు రశీద్, ఖేడ్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అలీని శుక్రవారం సురేశ్ షెట్కార్ సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, కౌన్సిలర్ వివేకానంద్, మాజీ జెడ్పీటీసీ రూప్‌సింగ్, చందర్‌నాయక్, నాయకులు సద్దాం, హన్మాండ్లు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుజాత


నియామకపత్రం అందుకుంటున్న సుజాత

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మండలంలోని కొన్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దండేపల్లి సునీతను నియమించారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా సుజాత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పూర్వ వైభవం కోసం మహిళలను చైతన్యం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మల జగ్గారెడ్డి, మెదక్ మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరీ రావు, టీపీసీసీ రాష్ట్ర ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, రవీందర్‌డ్డి, హత్నూర మండల అధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన తన్వీర్


మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తన్వీర్

జహీరాబాద్: రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఎండీ. తన్వీర్ మంత్రి హరీశ్‌రావును శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు హన్నాన్, సందీప్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే తన్వీర్‌ను సామాజిక ఉద్యమకారుడు, జీకాట్ ఎండీ. ఢిల్లీ వసంత్ సన్మానించారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మహ్మద్ తన్వీర్‌ను మండల బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం సన్మానించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వెలిమెల మాజీ సర్పంచ్ మహిపాల్‌గౌడ్ సూచించారు. శుక్రవారం వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు


బోనాలతో మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్‌లో శుక్రవారం ఉరడమ్మ తల్లికి బోనాలు నిర్వహించారు. పోత రాజుల విన్యాసాల మధ్య నిర్వహించిన బోనాలు గ్రామ పుర వీధుల గుండా ఆలయం వరకు కొనసాగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు బోనం సమర్పించారు.

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని శ్రీ సత్యసాయి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆషాఢ మాసం బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి జయమ్మ, ఉపాధ్యాయులు సంధ్యారాణి, శ్రీదేవి, జ్యోతి, పూర్ణిమ, సంగీత, మహలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోపు పనులు పూర్తి చేయాలి

- డీఈఓ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

జహీరాబాద్ టౌన్: మన ఊరు–మన బడి పనులు ఆగస్టు 15 లోపు పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేయించాలని పంచాయతీ రాజ్ ఏఈ కోటేశ్వర్‌రావుకు సూచించారు. సమావేశంలో ఎంఈఓ బస్వరాజ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, విద్యా కమిటీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం హోతి(కె)లో గల కేజీబీవీ పాఠశాలను తనఖీ చేశారు. సౌకర్యాలు, సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

బోనాల జాతరకు ఆహ్వానం


చింతా ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఈనెల 11న సంగారెడ్డి పట్టణంలో గౌడ కులస్తుల ఎల్లమ్మ తల్లి బోనాలు నిర్వహిస్తున్నట్టు గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్‌ను సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): ఆషాఢ మాసం దుర్గా భవాని అమ్మవారి జాతర సందర్భంగా ఈనెల 11వ తేదీన పట్టణ గౌడ సంఘం, నంబర్ వన్ సొసైటీ ఆధ్వర్యంలో బోనాల పండగ నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం చింతా ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

జహీరాబాద్ టౌన్: పర్యవరణం, ప్రజారోగ్యానికీ హాని కల్గించే ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత వారోత్సవాలు నిర్వహించి క్లాత్ బ్యాగ్‌ల తయారీపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. శుక్రవారం వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లాత్ బ్యాగుల తయారీతో పాటు ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా చైతన్యాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ట్రస్టీ విజయలక్ష్మి, నిర్వాహకులు రాంచందర్, శివబాబు, తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమలకు ప్రభుత్వం చేయూత


గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో గొర్రెల పెంపకం దారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ కురుమ కోరారు. మండలంలోని సంజీవన్‌రావుపేటలో శుక్రవారం గొర్రెల పెంపకం దార్లకు రెండోవిడత గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలుచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎంబరి విఠల్, ఎంపీటీసీ భూపాల్, పశువైద్యాధికారి నేతాజీ, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వేతన జీఓలు సవరించాలి**

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం పదేళ్లుగా కనీస వేతన జీఓలు సవరించకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాజీపల్లిలో కనీస వేతనాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, కాలపరిమితి ముగిసిన జీఓలను వెంటనే సవరించాలని కోరారు. మార్కెట్‌లో అన్ని ధరలు పెరుగుతున్నా కార్మికులు జీతాలు మాత్రం పెరగడం లేదని వాపోయారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, శేఖర్, ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు**

సంగారెడ్డి టౌన్: రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన 34 మంది ఆర్టీసీ ఉద్యోగులకు మెదక్ రీజనల్ మేనేజర్ సుదర్శన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్, మెకానిక్ విభాగం, డిపో మేనేజర్లు ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

◆ **మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని చాపల కేరీలో గల మహంకాళి ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు,



అభిషేకం నిర్వహించారు. అనంతరం చాపలకేరీ నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా మహిళలు సామూహిక కళశాల ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పులిమామిడి రాజు, పిల్లోడి విశ్వనాథం, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తుల్జరామ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **పార్కుల అభివృద్ధికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల్లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ బాలవిహార్ పార్కును ఆమె సందర్శించి మాట్లాడారు. చెత్త పేరుకుపోయిందని.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి శుభ్రం చేయిస్తామని చెప్పారు.

◆ **జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలి**

హత్నూర(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మె రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటయ్య, అశోక్, ముత్యాలు, ఎల్లయ్య, తిరుపతి చారి, శంకరయ్య, దుర్గమ్మ, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు**

మునిపల్లి(అందోల్): అందోల్ ఎమ్మెల్యే సహకారంతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేస్తున్నామని ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నచల్మెడలో సర్పంచ్ విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో సుమారు రూ. 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో చీలపల్లి సర్పంచ్ విరన్న పాటిల్, ఉపసర్పంచ్ దత్తుగౌడ్, నాయకులు వీరన్న, మోహన్, మొగులయ్య, పరమేశ్వర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

నారాయణఖేడ్: మండలంలోని తుర్కపల్లికి చెందిన భూమయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అత్యవసర చికిత్సల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తనయుడు రోషన్‌రెడ్డి శుక్రవారం బాధితుడి తండ్రి మల్లయ్యకు అందజేశారు.

◆ **ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం**

జహీరాబాద్ టౌన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గెస్ట్‌హౌస్ వద్ద జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత నరోత్తం, ఎమ్మార్పీస్ జిల్లా కోకన్వీనర్ చిరంజీవి, జహీరాబాద్ కన్వీనర్ అబ్రహం మాదిగ, నాయకులు జైరాజ్, రాజేందర్, ఉల్లాస్, కిట్టు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

◆ **కట్ట మైసమ్మకు పూజలు**

కల్హేర్(నారాయణఖేడ్): వర్షం కోసం సిర్గాపూర్ సకి చెరువు వద్ద శుక్రవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కట్ట మైసమ్మకు పూజలు చేశారు. అనంతరం చెరువు కట్టపై వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు యాదవరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

◆ **కూల్చివేతలు**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తండాలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం సాయంత్రం కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ **కాంగ్రెస్‌దే విజయం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రానున్న ఎన్నికల్లో విజయం కాంగ్రెస్‌దేనని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం నూతనంగా ఎన్నికైన రామచంద్రాపురం ,భారతినగర్ డివిజన్‌ల అధ్యక్షులు ఆయనను కలిసి సన్మానించారు.

◆ **సీపీఐ నాయకుల అరెస్ట్**

జహీరాబాద్ టౌన్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటనకు వస్తున్న సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు నిరసన కార్యక్రమాలు చేపట్టగా ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్, డివిజన్ కార్యదర్శి నర్సింలు, నాయకులు అజర్ అహ్మద్, హుసేన్, అఫ్జల్, తదితరులు పట్టణంలో ఆందోళనకు దిగారు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సాయంత్రం వదలిపెట్టారు.

◆ **అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు**

నారాయణఖేడ్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ ఖేడ్ డివిజన్ సహాయ కార్యదర్శి సీహెచ్ అశోక్ అన్నారు. ఖేడ్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.